క్లుప్తంగా

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

బచ్చన్నపేట: రైతులు ఆరు గాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దు.. మద్దతు ధరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి పలు గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

వీడ్కోలు సమావేశం

తరిగొప్పుల: మండలంలోని అబ్దుల్‌నాగారం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఐదో తరగతి విద్యార్థులకు నాల్గో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి సహచర విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వీరస్వామి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ డే కార్యక్రమాలు

చిల్పూరు: మండలంలో పలు గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆవరణలో శుక్రవారం గ్రామసభలు, ఇన్నోవేషన్ డే కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నపెండ్యాల, శ్రీపతిపల్లి గ్రామాల్లో సర్పంచ్‌లు మామిడాల లింగారెడ్డి, కేశిరెడ్డి ప్రత్యూషారెడ్డిల అధ్యక్షతన సమావేశాలను నిర్వహించారు. ఎంపీటీసీలు ఉమ, అయిలమ్మ, పంచాయతీ కార్యదర్శులు తౌటిరెడ్డి శశికుమార్, శ్రీకాంత్, ఉప సర్పంచ్‌లు గొంగిడి అనురాధ, రూపేష్, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, రంగు హరీష్, రంగు రమేష్, సమ్మయ్య పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

బచ్చన్నపేట: గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో టీ-ఇన్నోవేషన్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సమావేశాలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు నిర్వహించారు. కట్కూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులను నిర్వహించడానికి గ్రామస్తులను భాగస్వాములను చేయాలని తెలిపారు.

న్యాయం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లే దారికి అడ్డంగా రాళ్లను నాటి ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సముద్రాల గ్రామానికి చెందిన రైతు కత్తుల రాజు కోరుతున్నాడు. గ్రామంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సముద్రాల నుంచి నారాయణపురం వెళ్లే దారిలోని తన వ్యవసాయ భూమిలో 2019లో కోళ్ల ఫారం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయితే ఫారం వద్దకు వెళ్లేందుకు పూర్వికుల నుంచి ఉన్న దారికి అడ్డుగా.. అదే గ్రామానికి చెందిన కత్తుల యాదగిరి, అతని ఇద్దరు కుమారులు రాళ్లు నాటారని తెలిపారు. దీంతో కోళ్ల ఫారం వద్దకు దానా తీసుకొచ్చే వాహనం వెళ్లకపోవడంతో కోళ్లు మృతి చెందాయని, రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని వాపోయాడు. విషయమై సీఐకి, వరంగల్ సీపీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు.

సిద్ధేశ్వరాలయంలో వేలం

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్‌లోని శ్రీ సిద్ధేశ్వరాలయంలో వివిధ హక్కులకు వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చిందం వంశీ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆలయంలో టెంకాయలు, పూజా సామగ్రి విక్రయించడం, తలనీలాలు, కొబ్బరి ముక్కలు సేకరించడం, స్వామి వారి లడ్డు, పులిహోర, ఫలహారం తయారు చేసి విక్రయించడం వంటి వాటికి వేలం పాటలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వేలంలో హక్కుపొందినవారు సంవత్సరం పాటు ఆయా కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఏప్రిల్ 24న ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తామని ఆసక్తిగల వారు సీల్డ్ కవరుతో హాజరు కావాలని తెలిపారు. పూజారి ఓం నమః శివాయ, సిబ్బంది చట్ల రాజేందర్‌రెడ్డి, మధు, క్రాంతి, గంగం భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు బసవ జయంతి వేడుకలు

పాలకుర్తి టౌన్: సోమపాథ కళా పీఠం ఆధ్వర్యంలో రేపు శ్రీశోభకృత్ వైశాక శుక్ల తృతీయ రోజున పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో బసవ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు సత్యనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

యాచకుడి మృతి



దేవరుప్పుల : మండలంలోని కోలుకొండలో శుక్రవారం యాచకుడు మృతిచెందాడు. గురువారం ఆ గ్రామానికి వచ్చిన సుమారు అరవై ఏండ్ల వయస్సు కలిగిన యాచకుడు శుక్రవారం మధ్యాహ్నం వాగు వంతెన దాటి జనగామ వైపు రోడ్డు పక్కన పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఏఎస్సై సదానందం, సర్పంచ్ కూర్నాల రవి పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మైనార్టీలకు ప్రభుత్వం పెద్దపీట

ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ నేపథ్యంలో వివిధ పార్టీలు, ప్రజాప్రతినిధులు, సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేశారు. హిందూ ముస్లిం సామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఈసందర్భంగా పలువురు పేర్కొన్నారు. చిల్పూరులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బ్రాహ్మణ అర్చకులు పాల్గొనగా.. లింగాలఘనపురం మండలంలోని వడిచర్లలో ఎమ్మెల్యే రాజయ్య పాల్గొన్నారు. రాజయ్య మాట్లాడుతూ.. మైనార్టీలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. పలుగ్రామాల్లో ప్రభుత్వం ముస్లింలకు అందించిన రంజాన్ కానుకలను పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



లింగాలఘణపురం: వడిచర్లలో ఇఫ్తార్ విందులో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య



బచ్చన్నపేట: దుస్తులను అందజేస్తున్న రమణారెడ్డి



దేవరుప్పల : మాదాపురంలో..



చిల్పూరు: ఇఫ్తార్‌కు హాజరైన కరుణాకర్ శర్మ



స్టేషన్‌ఘన్‌పూర్: కానుకలను అందజేస్తున్న సర్పంచ్



జఫర్‌గఢ్: తమ్మడపల్లి (జి)లో..



జనగామ: ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న సీఐ

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రజల అంధత్వ నివారణకు గానూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తమ్మడపల్లిలోని గ్రామ పంచాయితీ కార్యక్రమంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది కంటి పరీక్షలను చేయించుకోవడానికి పట్టణాలకు వెళ్లే వసతులు లేక కంటి చూపు లోపంతోనే కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. అలాంటి వారి సౌకర్యార్థం ఈ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామస్తులు స్థానికంగా శిబిరాల్లో కంటి పరీక్షలను చేయించుకోవాలని అవసరమున్న వారికి ఉచిత కంటి అద్దాలను అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల కవిత, మండల వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మినీ ప్లీనరీ సభాస్థలి పరిశీలన



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 25న డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఉన్న స్థలంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ మినీ ప్లీనరీ సభాస్థలాన్ని ఎమ్మెల్యే రాజయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఈనెల 27న ఉండగా ప్రస్తుత వేసవి దృష్ట్యా బీఆర్ఎస్ శ్రేణులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నియోజకవర్గాల పరిధిలోనే ప్లీనరీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 25న ఘన్‌పూర్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ ప్లీనరీని దాదాపు 3,500 మంది పార్టీ ప్రతినిధులతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆహ్వానం ఉన్నవారే ప్లీనరీకి రావాలని సూచించారు. అదేవిధంగా నియోజకవర్గంలో రెండో క్లస్టర్ ఆత్మీయ సమావేశాలు మే నెలలో ఉంటాయని ఆయన తెలిపారు.

సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

జనగామ రూరల్: రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించాలని ఆత్మీయ సమ్మేళన జిల్లా ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం జనగామ మండల క్లస్టర్ 1 ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం స్థానిక గాయత్రి గార్డెన్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మాట్లాడుతూ.. కరువు ప్రాంతం అయిన జనగామను గోదావరి జలాలు తీసుకొచ్చి రైతుల పాదాలు కడిగిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. నాడు రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి ఉందో.. నేడు రాష్ట్రం వచ్చాక ఎలా ఉందో.. మన కళ్లముందే కనబడుతుందని అన్నారు. రానున్న కాలంలో గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలే బుద్ధిచెబుతారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల కళింగరాజు, జెడ్పీటీసీ నిమ్మతి దీపికరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దిలింగం, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు బొల్లం శారద, మండల రైతు కో ఆర్డినేటర్ ప్రమోద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు యాదగిరి పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.36వేలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్

రఘునాథపల్లి: మహిళా సంఘాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న వీఓఏలకు కనీస వేతనం రూ.36వేలు ఇవ్వాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు కొడిదేటి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో ముసిపట్ల శంకరయ్య అధ్యక్షతన నిర్వహించిన వీఓఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో మహిళా సంఘాల అభివృద్ధి కోసం పని చేస్తున్న వీఓఏలపై ప్రభుత్వం వివక్ష చూపడం తగదన్నారు. రెండు దశాబ్దాలుగా తక్కువ వేతనంతో పని చేస్తున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి శ్రమకు తగిన వేతనం ఇవ్వాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో కందుకూరి యోన, గుగులోతు వీరన్న, కొన్నె వెంకటస్వామి, తాళ్లపల్లి హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ఉత్సవాలు జయప్రదం

చిల్పూరు: బొడ్రాయి ఉత్సవాలను గ్రామ ప్రజల సహకారంతో జయప్రదం చేస్తానని బొడ్రాయి ఉత్సవ కమిటీ నూతన చైర్మన్ గంగుల సంపత్‌రెడ్డి అన్నారు. మండలంలోని లింగంపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామ సభ, బొడ్రాయి ఉత్సవ కమిటీ ఎన్నిక కార్యక్రమాన్ని సర్పంచ్ ఏదునూరి రవీందర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈనెల 30న పూజా కార్యక్రమాలను ప్రారంభిస్తామని, జూన్ 7, 8, 9న నూతన బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కమిటీ ఎన్నిక అనంతరం చైర్మన్ సంపత్‌రెడ్డి, సర్పంచ్ రవీందర్, ఎంపీటీసీ కంకటి రవీందర్, ఉప సర్పంచ్ కంకటి రాజన్న ఆధ్వర్యంలో బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా రావులపల్లి చంద్రమౌళి, బబ్బుల సోమలింగం, శ్యాంప్రసాద్, కండ్లకోలు శ్రీనివాస్, గొడుగు కొంరయ్య కోశాధికారి మట్ట యాదగిరి, కార్యదర్శి ఊరడి రాజు, ఎలిశాల తిరుపతి, మాటూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

లింగాలఘణపురం: మండలంలోని వడిచర్ల రోడ్డులో కొత్తపల్లి క్రాస్ వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో గుమ్మడవెల్లికి చెందిన చెన్నబోయిన యాదయ్య కాలు విరిగినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. యాదయ్య నవాబుపేట అంగడికి వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంపై గుమ్మడవెల్లికి వెళ్తుండగా కొత్తపల్లి క్రాస్ వద్ద కారు ఢీకొట్టినట్లు పేర్కొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

రఘునాథపల్లి: జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 29, 30 తేదీల్లో నిర్వహించే రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మూడో మహాసభల వాల్‌పోస్టర్లను ఎమ్మెల్సీ కడియం శ్రీహరి శుక్రవారం ఆవిష్కరించారు. రజక సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎదునూరి గట్టేశం, జిల్లా అధ్యక్షుడు మైలారపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హనుమకొండలో కడియంను కలిసి రజకుల సమస్యలు వివరించారు. మండల కేంద్రంలో రజక కులస్తులకు కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా కడియం సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మరికూకల సారయ్య, ఐలయ్య, భరత్, నాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని స్టేషన్‌ఘన్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో కొనసాగుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క హాత్ సే హాత్ జోడో యాత్రలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. సాంబయ్య సతీష్ ఉన్నారు.

ఎన్నిక

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడిగా గడ్డం అచ్చయ్యను ఎన్నుకున్నారు. శుక్రవారం కార్మికుల సమావేశంలో గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఇంజ నాగయ్య, కోశాధికారిగా రేణికుంట ప్రేమేష్, రైటర్‌గా మాదాం కర్ణాకర్, కార్యవర్గ సభ్యుడిగా రేణికుంట యాదగిరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దర్శనం, వెంకటేష్ పలువురు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం

దేవరుప్పుల : సాంకేతిక పరిజ్ఞానంపై ప్రజలకు అవగాహన అవసరమని ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల చిన్నమడూరుకు చెందిన రాపాక దుర్గప్రసాద్ సెల్‌ఫోన్ పోగొట్టుకోగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సెల్‌ఫోన్‌ను సాంకేతిక పద్ధతిలో స్వాధీనం చేసుకొని అప్పగించారు. కానిస్టేబుల్ యాకుబ్, అశోక్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బచ్చన్నపేట: మండలంలోని బసిరెడ్డిపల్లిలో ఇటీవల మృతి చెందిన కుక్కసావు అంజయ్య కుటుంబానికి సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, కొడవటూర్ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి రూ.10వేలు అందించారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలగోని పర్శరాములుగౌడ్, నాయకులు బాలగోని రాజు, రాగిపెల్లి బుచ్చయ్య, పరమేశ్వర్, శ్రీహరి, కర్ణాకర్, బాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకటయ్య, నర్సింహులు, చంద్రయ్య, భాస్కర్ పలువురు పాల్గొన్నారు.

ఆదుకుంటాం

దేవరుప్పుల : చేనేత కార్మికుడు చెన్నూరు కొండయ్య కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని సర్పంచ్ పోతిరెడ్డి బెల్లీనాలీనారెడ్డి అన్నారు. శుక్రవారం కొండయ్య అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో నక్క రమేష్, భాషిపాక భిక్షపతి, మహేష్ పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

స్టేషన్‌ఘన్‌పూర్: సముద్రాల గ్రామానికి చెందిన భాస్కుల వంశీ(26), పసులారి శ్రావణి(19) ప్రేమించి వివాహం చేసుకుని శుక్రవారం స్థానిక పోలీసులను ఆశ్రయించారు. సముద్రాలకు చెందిన భాస్కుల వంశీ, అదే గ్రామానికి చెందిన వరుసకు మేనకోడలైన(అక్క కుమార్తె) శ్రావణిని గత కొంత కాలంగా ప్రేమిస్తున్నాడు. వారి ప్రేమకు పెద్దలు అంగీకరించక పోవడంతో చిల్పూరు శ్రీబుగులు వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం పెద్దలతో ఆపద ఉందని సీఐ రాఘవేందర్‌ను ఆశ్రయించారు.

రైతు సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం

● ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి: రైతు సంక్షేమం, అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, లక్ష్మీతండా, మాదారం, సోమయ్యకుంటతండా, వెల్దిలో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయా గ్రామాలల్లో సర్పంచ్‌లు ఎండీ హయతలి, దొరగొల్ల అయిలమ్మ, పయ్యావుల లావణ్యకుమార్, గుడి రాంరెడ్డి, కొయ్యడ మల్లేష్, కేతావత్ పార్వతిల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి రూ.2,060 మద్దతు ధర పొందాలని సూచించారు. ఇదిలా ఉండగా.. మండలంలోని వెల్ది సమీపంలో ఎంఆర్ఆర్ ఎఫ్‌డీఆర్ నిధులతో మంజూరైన రూ.32లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న స్లాబ్ కల్వర్టు పనుల శిలాఫలకాన్ని ఎమ్మెల్యే రాజయ్య ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ బొల్లం అజయ్, ఏట శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంపీ సార య్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, రైతుబంధు మండల కన్వీనర్ గొరిగె రవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్, నామాల బుచ్చయ్య, సంపత్, భాగ్యలక్ష్మి, ఎల్లస్వామి, సునిత, మమత, యాదగిరి, శ్రీనివాస్, మల్లేష్ ఉన్నారు.

ఆరబెట్టిన ధాన్యం తీసుకురండి

లింగాలఘణపురం: తాలు లేకుండా ఆరబెట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి గిట్టుబాటు ధర పొందాలని కళ్లెం పీఏసీఎస్ చైర్మన్ ఉపేందర్ కోరారు. శుక్రవారం మండలంలోని సిరిపురం, మాణిక్యాపురం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ విజయభాస్కర్, సర్పంచ్‌లు లక్ష్మీభాస్కర్‌రెడ్డి, శ్వేతపూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పాలకుర్తి: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరావులు శుక్రవారం ప్రారంభించారు. మండల రైతు బంధు కోఆర్డినేటర్ వీరమనేని యాకాంతరావు, సహకార సొసైటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, సర్వర్‌ఖాన్ పాల్గొన్నారు.

కేంద్రాలను వినియోగించుకోవాలి

జఫర్‌గఢ్: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు అన్నారు. సహకార సొసైటీ, ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని కూనూర్, జఫర్‌గఢ్, హిమ్మత్‌నగర్, తమ్మడపల్లి (జి), సూరారం, తిమ్మంపేట, రఘునాథ్‌పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్‌లు అశోక్, పద్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

దేవరుప్పుల : మండల కేంద్రంతోపాటు సీతారాంపురం, కడవెండి, పెద్దమడూరు, చిన్నమడూరు, రామరాజుపల్లి, కామారెడ్డిగూడెం, మున్‌పహాడ్‌లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ బస్వ సావిత్రి, తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డి వేర్వేరుగా ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

సెలవుల్లో చదువులపై దృష్టి సారించాలి

జఫర్‌గఢ్: వేసవి సెలవుల్లో సైతం విద్యార్థులు చదువులపై దృష్టి సారించాలని మండల నోడల్ ఆఫీసర్ ఎండీ పర్వేజ్ కోరారు. మండలంలోని కూనూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ పర్వేజ్ మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు చదువుకునేందుకు కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సురేష్‌రెడ్డి, సోమయ్య, శ్రీనివాస్, మదన్‌మోహన్‌రెడ్డి, రామానుజం, సుధాకర్ పాల్గొన్నారు.

'బలగం' నటులకు అభినందన



బలగం సినీ తారలతో పాఠశాల బృందం, చిన్నారులు

జనగామ రూరల్: జిల్లా కవులు కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బలగం సినీ తారలకు శుక్రవారం మండలంలోని వడ్లకొండ గ్రీన్ వుడ్ హైస్కూల్‌లో ఘనంగా అభినందన సభను నిర్వహించారు. అంతకు ముందు పాఠశాలలో బలగం సినిమాను ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి జరసం నాయకుడు ఆయిలా సోమనర్సింహాచారి అధ్యక్షత వహించగా బలగం సినిమా బృందం కొమురయ్య పాత్రదారి సుధాకర్‌రెడ్డి, జీవి బాబు, గుండా మల్లేష్, ప్రభాకర్, అంజిబాబు, విద్యాసాగర్, ప్రవీణ్, వీణా, రేఖ, ఎలేశ్వరం, విజయలక్ష్మి, సంజయ్, సహదేశ్, మధులను కవులు ఘనంగా సన్మానించారు. సినిమాలోని పాత్రల్లో జీవించి నటనను ప్రదర్శించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జమున, రిటైర్డ్ కల్నల్ భిక్షపతి, డాక్టర్ రాజమౌళి, సర్పంచ్ శారద, కవులు కృష్ణ, సోమేశ్వారాచారి, నర్సయ్య, సలావుద్దిన్, మురళి పాల్గొన్నారు.

ఐకమత్యమే విజయానికి నాంది



ఉగాది డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ/ నర్మెట: ఐకమత్యంతో ఏదైనా సాధించవచ్చని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి సాధికారత కోసం కృషి చేస్తున్న మెపా (ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆదర్శనీయమని అన్నారు. ఈ సందర్భంగా మెపా ఆధ్వర్యంలో రూపొందించిన ఉగాది డైరీ, పెద్దమ్మతల్లి ఫొటోతో ముద్రించిన క్యాలెండర్‌ను శుక్రవారం హన్మంతాపూర్ దొడ్లగడ్డ తండా క్యాంపు కార్యాలయంలో మెపా బాధ్యులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మెపా జిల్లా అధ్యక్షుడు నీల అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లో చేర్చి అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెపా జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది రెడ్డబోయిన రాజు, నాయకులు పగడాల నర్సయ్య, ఇట్టబోయిన రమేష్, నీల విజయ్‌కుమార్, పిట్టల కరుణాకర్, మంగ యాదగిరి, దూసరి భాస్కర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ముదిరాజ్‌లు



కడియంతో ముదిరాజ్ నాయకులు

రఘునాథపల్లి: మండలంలోని మండలగూడెం ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు కోసం తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల సదానందం, మండల ప్రధాన కార్యదర్శి ఉత్తెపు సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని కలిసి విజ్ఞప్తి చేశారు. అదనపు గదులకు రూ.5 లక్షల మంజూరు చేయాలని కోరగా.. స్పందించిన కడియం శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు నీల కృష్ణమూర్తి, బాలరాజు, బోళ్ల కుమార్, ఉడుత భిక్షపతి, పిట్టల రజనీకాంత్ ఉన్నారు.